క్లుప్తంగా

ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా వేకువజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణ చేశారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

తారురోడ్డు పరిశీలన

కాశినాయన : మండలంలోని పిట్టిగుంట నుండి తెల్లపాడు వరకు రూ.2.60 కోట్ల పీఎంజీఎస్‌ నిధులతో నిర్మించిన తారురోడ్డును శనివారం ఎస్‌కెపీ ఈఈ సుబ్రమణ్యం, డీఈ అమర్‌నాథ్‌, డీఎల్‌ శ్రీనివాసరావు పరిశీలించారు. రోడ్డును నాణ్యతగా వేశారా లేదా అని పరీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎంజీఎస్‌ నిధులతో మండలంలో పలు రోడ్లను నిర్మించామన్నారు. త్వరలో మరికొన్ని రోడ్ల నిర్మాణాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న సునీల్‌కుమార్‌

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక శ్రీనివాసనగర్‌లోని సృజన్‌ ట్యుటోరియల్స్‌లో శనివారం పేద దివ్యాంగుల పిల్లలకు విద్యాసామగ్రిని ట్యుటోరియల్స్‌ యజమాని సునీల్‌ కుమార్‌ అందచేశారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పలకలు, పెన్నులు తదితర విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఉచితంగా కంప్యూటర్‌ విద్యను నేర్పిస్తానని వారికి తెలిపారు. ఆల్‌ ఆఫ్‌ యూ దివ్యాంగుల రాష్ట్ర సొసైటీ అధ్యక్షుడు అఫ్జల్‌, గౌరవాధ్యక్షుడు చలపతిరావు, వ్యాపారి ఖాదరవలి, దివ్యాంగులు పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రొద్దుటూరు : స్థానిక వసంతపేటలోని మున్సిపల్‌ హైస్కూల్‌ 1986–87 బ్యాచ్‌ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని ఆదివారం 10 గంటలకు ఏర్పాటు చేశామని కార్యక్రమ సమన్వయకర్త దేశాయ్‌ సత్యనారాయణ రావు తెలిపారు. తమకు చదువు చెప్పిన గురువులను వారి ఇళ్ల వద్దకు వెళ్లి కార్యక్రమానికి రావాలని ఆహ్వానించినట్లు ఆయన పేర్కొన్నారు. మరణించిన మిత్రుల కుటుంబాలకు ఆర్థిక చేయూత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆ సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులంతా కార్యక్రమంలో తప్పక పాల్గొనాలని కోరారు.

స్కార్పియో బోల్తా


బోల్తా పడిన స్కార్పియో వాహనం

కలసపాడు : మండలంలోని పిడుగుపల్లె – శంఖవరం గ్రామాల మధ్యలో మలుపు వద్ద శనివారం స్కార్పియో బోల్తాపడటంతో ఐదుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఎగువ తంబళ్ళపల్లె గ్రామంలో జరిగిన ఓ వివాహానికి హాజరై తిరిగి సొంత గ్రామమైన ప్రొద్దుటూరుకు స్కార్పియో వాహనంలో వెళుతుండగా మార్గంమధ్యలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో స్కార్పియోలో ప్రయాణిస్తున్న సమీర్‌తోపాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. వెంటనే బాధితులను 108 వాహనం ద్వారా పోరుమామిళ్ళ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమీర్‌ను మెరుగైన చికిత్స కోసం కడపకు తీసుకెళ్లారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

దువ్వూరు : దువ్వూరు చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లు పట్టుబడినట్లు మైనింగ్‌ అధికారి కల్యాణి తెలిపారు. ట్రాక్టర్లను దువ్వూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఆమె చెప్పారు. ట్రాక్టర్లను మైక్రో ఇరిగేషన్‌ డిపార్ట్‌మెంట్‌ వారు పరిశీలించి జరిమానా విధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనింగ్‌ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాలి

పోరుమామిళ్ల : ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్మీడియట్‌ విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి మండల ఆర్‌ఐ సుధాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు విజయభాస్కర్‌, చెన్నకృష్ణ, గురుమోహన్‌, వంశీ, ఖలీల్‌, సాగర్‌, పోలయ్య, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు లబ్ధి

ప్రొద్దుటూరు : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రజలకు లబ్ధి చేకూరుస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని స్వరాజ్యనగర్‌లో ఉన్న 7వ వార్డు సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులతోపాటు కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం ఇలా పరిపాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లలేదన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలతోపాటు ధ్రువీకరణ పత్రాలను ఇంటి వద్దకే వెళ్లి ఇస్తారన్నారు. సర్టిఫికెట్ల కోసం ఎలాంటి డబ్బు తీసుకోరని తెలిపారు. వైఎస్సార్‌ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలనను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లామన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్లను నియామకం, ప్రస్తుతం జగనన్న సురక్ష ద్వారా నేరుగా ఇంటింటికి వెళ్తున్నామన్నారు. 99 శాతం హామీలను సీఎం జగన్‌ నెరవేర్చారని పేర్కొన్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని ఎన్నడూ చూడలేదన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌ గుర్రం లావణ్య ప్రకాష్‌, సచివాలయ కన్వీనర్లు బంకా లక్ష్మిరెడ్డి, చంటి, రవికుమార్‌, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్‌ కాకర్ల నాగేశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

పోరుమామిళ్ళ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీరాజ్‌ రూరల్‌ డెవలప్‌మెంట్‌ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పుల్లీవీడు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకునేందుకు వారం రోజుల పాటు జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ రఘునాథరెడ్డి, వైస్‌ ఎంపీపీ సి.బాషా, ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్‌, తహసీల్దారు గంగయ్య, ఎంఎల్‌ఓ మనోజ్‌, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పట్టణంలోని మండల పరిషత్‌ కార్యాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, రంగసముద్రం సర్పంచ్‌ చిత్తా రవిప్రకాష్‌ రెడ్డి, తహసీల్దారు గంగయ్య, ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్‌లు రంగసముద్రం–2 సచివాలయం వలంటీర్లు, బూత్‌ కన్వీనర్లతో వలంటీర్లకు విధి విధానాలు, ప్రతి వార్డు సచివాలయాల్లో శిక్షణా తరగతులు ప్రారంభించారు.

ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలి

గోపవరం : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు దామోదర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం గోపవరంలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎంపీడీఓ హరినారాయణ, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయకుమార్‌, ఏఈఓ విజయ్‌, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పుల్లీవీడు సచివాలయంలో మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

అర్హులకు లబ్ధి చేకూర్చేందుకే జగనన్న సురక్ష

బద్వేలు అర్బన్‌ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేని అర్హులను గుర్తించి వారికి లబ్ధి చేకూర్చడానికే జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ శ్రీకారం చుట్టారని బద్వేలు జెడ్పీటీసీ వంకెల చిన్నపోలి రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పుట్టాయపల్లె పంచాయతీలోని గొడుగునూరులో నిర్వహించిన జగనన్న సురక్ష ఇంటింటి సర్వే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సర్వే కార్యక్రమాన్ని తహసీల్దారు మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్‌లు వేరువేరుగా పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్‌ పి.జయరామిరెడ్డి, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారులపై వరద ఆగ్రహం

ప్రొద్దుటూరు క్రైం : మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అటవీశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఎర్రగుంట్ల రోడ్డులోని అటవీశాఖ కార్యాలయానికి వెళ్లారు. మాడరన్‌ సా మిల్‌ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని సబ్‌ డీఎఫ్‌ఓ దివాకర్‌తో అన్నారు. అటవీ భూమిని ఆక్రమించి యథేచ్ఛగా కట్టడాలు నిర్మిస్తున్నా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. కొందరు అధికారుల అవినీతి మూలంగానే ఎర్రచందనం అక్రమ రవాణా సాగుతోందని తెలిపారు.

నేడు ఎలక్ట్రీషియన్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సమావేశం

ప్రొద్దుటూరు కల్చరల్‌ : ది ప్రొద్దుటూరు ఎలక్ట్రీషియన్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సమావేశాన్ని ఆదివారం ఉదయం 9 గంటలకు త్యాగరాజ రెడ్డి కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్‌ అధ్యక్షుడు దస్తగిరి, కోశాధికారి వెంకటనారాయణ తెలిపారు. ఈ సమావేశంలో పట్టణంలోని ఎలక్ట్రీషియన్ల సమస్యలు, అసోసియేషన్‌ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, అసోసియేషన్‌ చేపట్టిన కార్యక్రమాలపై చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, టీటీడీ పాలకమండలి సభ్యుడు టంగుటూరు మారుతిప్రసాద్‌ ముఖ్య అతిథులుగా హాజరవుతారని, పట్టణంలోని ఎలక్ట్రీషియన్లు, ఎలక్ట్రికల్‌ షాపుల యజమానులు పాల్గొనాలని వారు కోరారు.

అకడమిక్‌ క్యాలెండర్‌కు అనుగుణంగా బోధన

ప్రొద్దుటూరు కల్చరల్‌ : ప్రభుత్వ పాఠశాలలో అకడమిక్‌ క్యాలెండర్‌కు అనుగుణంగా బోధన కొనసాగించాలని ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి తెలిపారు. శనివారం అనిబిసెంట్‌ మున్సిపల్‌ హైస్కూల్‌లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జేవీకే కిట్లకు తల్లిదండ్రులతో బయోమెట్రిక్‌ వేయించాలని కోరారు. 26, 27 తేదీల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి జేవీకే, అమ్మ ఒడి, మధ్యాహ్న భోజనం, నాడు–నేడు, పాఠశాలల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించాలని చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును సకాలంలో నమోదు చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు లెసన్‌ ప్లాన్‌ రాయాలని, రెడిమేడ్‌ లెసన్‌ప్లాన్‌ను ఉపయోగిస్తే చర్యలు తప్పవన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు తగినట్లు త్వరలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి

డీకే చదువులబాబుకు సన్మానం

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో శనివారం కేంద్ర సాహిత్య అకాడమి అవార్డుకు ఎంపికైన డీకే చదువులబాబును ఉపాధ్యాయ సంఘాల సమన్వయవేదిక గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కవి ఏసీ దస్తగిరి మాట్లాడుతూ చదువులబాబు బాలసాహిత్యంపై విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన కథలు రాయడమే కాక విద్యార్థులతో కూడా కథలు రాయించడం గొప్ప విషయమన్నారు. ఎస్‌ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్‌ కొండయ్య, రచయిత జింకా సుబ్రహ్మణ్యం, రామచంద్ర, సాయికుమార్‌, ఒబులేసు, గంగాధర్‌, జింకా శేఖర్‌ పాల్గొన్నారు.


చదువులబాబును సత్కరిస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

వ్యవసాయేతర భూముల మార్పులు పరిశీలించిన ఆర్డీఓ

చాపాడు : మండల కేంద్రమైన చాపాడు రెవెన్యూ పొలంలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మార్చాలని రైతులు చేసుకున్న దరఖాస్తులను శనివారం జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన చాపాడు రెవెన్యూ పొలంలో సర్వే నంబర్‌ 32లో 0.18 ఎకరాలు రైతులు వ్యవసాయేతర భూమిగా మార్చాలని దరఖాస్తు చేసుకున్నారన్నారు. రైతుల వద్ద ఉన్న పత్రాలను రికార్డుల వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ సుభాని, సర్వేయర్‌ సాయి లత, వీఆర్‌ఓలు ఫజల్‌, శ్రీనివాసులు రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


భూ రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

విద్యకు సీఎం అధిక ప్రాధాన్యత

ప్రొద్దుటూరు : సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి తెలిపారు. శనివారం 1వ వార్డు బొల్లవరం మున్సిపల్‌ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన బడి నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల కార్పొరేట్‌ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారన్నారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. రాయలసీమ పోలీసు కంప్లెయింట్‌ అథారిటీ మెంబర్‌ కాకర్ల నాగేశేషారెడ్డి, ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌ గోనా ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్‌ సరోజమ్మ, చాడా లక్ష్మిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


జగనన్న విద్యాకానుక కిట్లను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఫీజుల దోపిడీని అరికట్టాలి

ప్రొద్దుటూరు కల్చరల్‌ : కార్పొరేట్‌, ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలను శనివారం స్థానిక డిప్యూటీ డీఈఓ కార్యాలయం వద్ద పీడీఎస్‌యూ నాయకులు మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. పీడీఎస్‌యూ పట్టణాధ్యక్షుడు విగ్నేష్‌ మాట్లాడుతూ ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల నియోజకవర్గాల్లో కార్పొరేట్‌, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు, పుస్తకాల విక్రయాలతో విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. హాస్టల్‌ అనుమతి లేకున్నా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. ఎంఈఓలకు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. పీడీఎస్‌యూ పట్టణ నాయకులు మహేష్‌, చరణ్‌, అబూబకర్‌, అక్బర్‌, ఆసిఫ్‌, మహబూబ్‌ బాషా తదితరులు పాల్గొన్నారు.


మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ఆరోగ్యమాత క్షేత్రానికి నూతన డైరెక్టర్‌

కడప కల్చరల్‌ : కడప నగరంలోని సుప్రసిద్ధ క్రైస్తవ ఆరాధన క్షేత్రమైన ఆరోగ్యమాత పుణ్యక్షేత్రానికి నూతన డైరెక్టర్‌ను నియమించారు. రైల్వేస్టేషన్‌ సమీపంలోని ఈ క్షేత్రానికి ఇప్పటివరకు పెండ్లికట్ల అబ్రహాం డైరెక్టర్‌గా ఉండేవారు. ఆయన స్థానంలో నూతన డైరెక్టర్‌గా ఫాదర్‌ ఎండీ ప్రసాద్‌రావు నియమితులయ్యారు. కడప అపోస్తలిక పాలనాధికారి, కథోలిక పీఠాధిపతులు బిషప్‌ గాలి బాలి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు నూతన డైరెక్టర్‌ ఫాదర్‌ ప్రసాద్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్యమాత క్షేత్రంలోని తన కార్యాలయంలో నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమాత విశ్వాసులను మరింత ఆధ్యాత్మిక పథకంలో ముందుకు నడిపించేందుకు ఈ క్షేత్రాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఎన్నికల హామీలు నెరవేర్చిన ఏకైక సీఎం జగన్‌

మైదుకూరు : ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం దేశం మొత్తం మీద వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి మాత్రమేనని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. శనివారం మైదుకూరు మున్సిపాలిటీలోని 11వ వార్డులో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో రాష్ట్ర ప్రజల సమస్యలను కళ్లారా చూసిన వైఎస్‌ జగన్‌ మేనిఫెస్టోలో అనేక హామీలను పొందు పరిచారని అన్నారు. ఇచ్చిన హామీలను కేవలం మూడేళ్లలోనే నెరవేర్చారని అన్నారు. ఈ విధంగా ఏ రాష్ట్ర సీఎం చేయలేదని పేర్కొన్నారు. సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలు అమలు చేస్తూ అన్ని వర్గాల వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా అనేక మార్పులు తెచ్చారని తెలిపారు. వసతులు కరువైన ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలను నాడు–నేడు కార్యక్రమంతో రూపురేఖలు మార్చారని అన్నారు. ఆర్బీకేలను ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచారని తెలిపారు.


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

సమస్యలపై స్పందన

పట్టణంలోని 11వ వార్డు ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలపై ఎమ్మెల్యే రాఘురామిరెడ్డి స్పందించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పలువురు పక్కా ఇళ్లు కావాలని అడగగా వెంటనే మంజూరు చేస్తామన్నారు. ఓ మాజీ సైనికుడు తనకు భూమి ఇప్పించాలని కోరగా ఆ మేరకు హామీ ఇచ్చారు. పలువురు సంక్షేమ పథకాలు అందలేదని ఫిర్యాదు చేశారు. దానిపై స్పందిస్తూ జూలై 1 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని పథకాల లబ్ధికి అవసరమైన సర్టిఫికెట్లను పొందాలని సూచించారు.

కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ మాచనూరు చంద్ర, వార్డు కౌన్సిలర్‌ పిల్లి ఇందిరారమణి, ఇన్‌చార్జి పిల్లి నాగయ్య, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ షరీఫ్‌, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, భూమిరెడ్డి సుబ్బరాయుడు, భరత్‌ కుమార్‌రెడ్డి, కౌన్సిలర్‌ వెంకటసుబ్బన్న, కోఆప్షన్‌ సభ్యుడు ట్రాక్టర్‌ గౌస్‌, ఏడో వార్డు ఇన్‌చార్జి సొద్దల సురేష్‌, మార్కెట్‌ రవి, నాయబ్‌ రసూల్‌, గోశెట్టి రామచంద్ర, దాదాపీర్‌, ఖాదర్‌, సన్న శ్రీనురావు, కరిడి రమణమూర్తి, వీరభద్రుడు, గౌస్‌, మున్సిపల్‌ ఏఈ నిరంజన్‌రెడ్డి, డీటీ మల్లికార్జున, హౌసింగ్‌ డీఈఈ పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

ఎంఈఓలకు సన్మానం

బి.కోడూరు : మండలంలోని ఆదిత్యారాంపేట సచివాలయంలో బదిలీపై వెళుతున్న ఎంఈఓ పి.మురళీదేవి, ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన ఎంఈఓ మూరతోటి సునీల్‌కుమార్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతులలో బి.కోడూరు ఎంఈఓగా పనిచేస్తున్న మురళీదేవి గోపవరం మండలం భావనారాయణనగర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బదిలీపై వెళ్లారు. అలాగే టి.సుండుపల్లె జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్న మూరతోటి సునీల్‌కుమార్‌ బదిలీపై బి.కోడూరు ఎంఈఓగా వచ్చారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు.

పోరుమామిళ్ళ : పోరుమామిళ్ళ మండల విద్యాశాఖాధికారిగా పనిచేస్తూ బదిలీపై గోపవరం మండలానికి వెళ్ళిన పి.రఘురాములను శనివారం ఘనంగా సన్మానించారు. పోరుమామిళ్ళ నూతన విద్యాశాఖాధికారి పి.రత్నస్వామి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి, ఏపీటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు ఎస్‌.భాస్కర్‌రెడ్డి, యూటీఎఫ్‌ జిల్లా కార్యదర్శి కె.చెన్నయ్య, ఏపీయూఎస్‌ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శీలిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రొద్దుటూరు కల్చరల్‌ : కర్నూలు జిల్లా గంజిహల్లి గ్రామంలో మైనర్‌ బాలికపై అత్యాచారానికి పాల్పడిన బడేసాబ్‌తోపాటు నిందితులను కఠినంగా శిక్షించాలని జిల్లా సగర సంఘం అధ్యక్షుడు మాదాసు మురళి తెలిపారు. శనివారం తమ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఘటన జరిగి నాలుగు రోజులవుతున్నా ఇంతవరకు పూర్తి స్థాయిలో నిందితులను పట్టుకుని కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు. అత్యాచారానికి గురైన బాలికకు రక్షణగా ఉండాల్సిన అధికారులు నిందితులకు రక్షణగా ఉండటం ఏమిటని ప్రశ్నించారు. బాధిత బాలికకు న్యాయం చేయాలని, లేకపోతే సగర కులస్తులు, బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అందరు ఏకమై ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సగర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి గోవిందు, రామచంద్రుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టుసాధించేలా బోధన

వైవీయూ : విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టుసాధించేలా అధ్యాపకులు చర్యలు తీసుకోవాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్‌ జి. రవీంద్రనాథ్‌ పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని ఆర్ట్స్‌ కళాశాలలో ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించిన ఆంగ్లమాధ్యమ శిక్షణ ముగింపు శనివారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ మారుతున్న ప్రపంచీకరణ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచి, విద్యార్థుల్లో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా ఆంగ్లభాషపై పట్టు సాధించే విధంగా బోధన సాగించాలన్నారు.

సంక్షేమ పథకాలతో అభివృద్ధి

పోరుమామిళ్ళ : పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ పేర్కొన్నారు. శనివారం మండలంలోని అక్కలరెడ్డిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని వెంకటాపురం, జిల్లెల్ల, వాసుదేవపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికి వెళ్ళి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే సంక్షేమ పథకాల వలన కలిగిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్‌ రూరల్‌ డెవలప్‌మెంట్‌ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్‌, మండల ఉపాధ్యక్షులు చెన్ను రాజశేఖర్‌, మాజీ సర్పంచ్‌ బాలగురివి రెడ్డి, ఎంపీటీసీ రవికుమార్‌, పంచాయతీ ఇన్‌చార్జి రామ్మోహన్‌ రెడ్డి, రామచంద్రా రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చాపాటి సాయినారాయణ రెడ్డి, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


వృద్ధుడికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ

యూనిఫాం సివిల్‌ కోడ్‌ను ముస్లింలు వ్యతిరేకించాలి

ప్రొద్దుటూరు కల్చరల్‌ : కేంద్ర ప్రభుత్వం దేశంలో యూనిఫాం సివిల్‌కోడ్‌ను తీసుకురావాలనే ప్రయత్నం చేస్తోందని దీనిని ముస్లింలు అందరు ఐకమత్యంతో వ్యతిరేకించాలని అంజుమన్‌ అహలె ఇస్లాం కమిటీ సెక్రటరీ ఖురేషి ఇలియాస్‌ ఓ ప్రకటనలో తెలిపారు. దేశాన్ని హిందూ దేశంగా మార్చే పన్నాగంలో భాగమే ఈ యూనిఫాం సివిల్‌కోడ్‌ ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. దీని మూలంగా ముస్లింలకు ఇబ్బందులు ఎదురవుతాయని, క్రిమినల్‌ లా అనేది దేశంలో అందరికి ఒకటే అని వివరించారు. ముస్లింలకు వివాహం, విడాకులు, దత్తత, వారసత్వ ఆస్తిపంపకాల కోసం ముస్లింలకు ప్రత్యేక లా ఉందని తెలిపారు. ముస్లింలు జమాత్‌ల పేరుతో నిర్లక్ష్యంగా ఉండకుండా యూనిఫాం సివిల్‌కోడ్‌పై అవగాహన తెచ్చుకోవాలని సూచించారు. ముస్లింలందరు మేల్కొని యూనిఫాం సివిల్‌కోడ్‌ను వ్యతిరేకిస్తూ లా కమిషన్‌కు లేఖలు రాయాలని కోరారు.

'కామన్‌ సివిల్‌ కోడ్‌' నిర్ణయం సరికాదు

ప్రొద్దుటూరు : కేంద్ర ప్రభుత్వం కామన్‌ సివిల్‌ కోడ్‌ అమలు చేయడాన్ని మానుకోవాలని ఇన్సాఫ్‌ జిల్లా కార్యదర్శి షరీఫ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంలో హిందూ, ముస్లింల మధ్య విభేదాలు సృష్టించి లబ్ధి పొందేందుకు కామన్‌ సివిల్‌ కోడ్‌ను బీజేపీ ప్రభుత్వం తెరపైకి తెచ్చిందని ఆయన పేర్కొన్నారు. దేశంలో అనేక మతాలకు చెందిన, కులాలకు చెందిన ప్రజలు అన్నదమ్ముల్లా జీవిస్తున్నారని తెలిపారు. వారిని తమ ఆచారాలను పాటించనివ్వకుండా కేంద్రం వ్యూహం పన్నుతోందన్నారు. మత విశ్వాసాల్లో జోక్యం చేసుకోవడాన్ని మైనారిటీలు వ్యతిరేకిస్తున్నారని, ఏ మతానికి, కులానికి చెందిన వారైనా నేరం చేస్తే అందరికీ ఒకే శిక్షా స్మృతి అమలు కావడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదని పేర్కొన్నారు.

రెవెన్యూ సిబ్బంది అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

బ్రహ్మంగారిమఠం : రెవెన్యూ కార్యాలయంలోని రికార్డులు, సిబ్బంది అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు జి.శివకుమార్‌ డిమాండ్‌ చేశారు. శనివారం బి.మఠంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వాలు అధికారంలో ఉన్నపుడు తహసీల్దార్లు వీఆర్‌ఓలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో విచ్చలవిడిగా ప్రభుత్వ భూములను ఎలాంటి ఆధారాలు లేకుండా ఆన్‌లైన్‌ చేయడంతో వ్యవసాయం చేస్తున్న నిజమైన రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు విజిలెన్స్‌ అధికారులతో దర్యాప్తు చేయిస్తే అసలు అవినీతి బట్టబయ్యలు అవుతుందన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఓ సర్వేయర్‌ 10 సంవత్సరాలుగా ఇక్కడ పనిచేసి ఉండంతో అధికారులు బదిలీ చేయగా డిప్యుటేషన్‌ సాకుతో తిరిగి ఇక్కడికి వచ్చిందన్నారు. అసైన్‌మెంట్‌ ద్వారా ప్రభుత్వం నిరుపేదలకు 2007, 2008లో ఇచ్చిన డీ పట్టాలకు భూములు చూపాలని ఎన్నిసార్లు అధికారులను సీపీఎం కోరినా ఇప్పటికి సర్వేయర్‌ నిర్లక్ష్య చేస్తూ వస్తోందన్నారు. రెవెన్యూ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలని సీపీఎం కోరుతోందన్నారు. సీపీఎం మండల కార్యదర్శి సాన గోవింద్‌, కమిటీ సభ్యులు హరి, అజయ్‌, నరసింహులు,రాహుల్‌ తదితరులు పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

వైవీయూ : అకడమిక్‌ కన్సల్టెంట్‌లు బోధనా నైపుణ్యాలను, పరిశోధన దృక్పథం పెంపొందించుకోవాలని వైవీయూ వైస్‌ చాన్సలర్‌ ఆచార్య చింతా సుధాకర్‌ పేర్కొన్నారు. వైవీయూలో అకడమిక్‌ కన్సల్టెంట్‌ల పనితీరుపై మదింపు కార్యక్రమం రెండోరోజు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ, రిజిస్ట్రార్‌ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడారు